క్లుప్తంగా

ఘనంగా పోతురాజుబాబు పండగ



పోతురాజుబాబును దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : ఉమ్మలాడలో మంగళవారం పోతురాజుబాబు పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున పోతురాజుబాబును దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ , ఉప సర్పంచ్ మందా రాము, ఎంపీటీసీ కృష్ణవేణి తదితరులు పోతురాజుబాబును దర్శించుకొని పూజలు చేశారు.

ఘనంగా రామాలయం వార్షికోత్సవం



వెంకటాపురంలో రాముల వారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : వెంకటాపురంలో మంగళవారం రామాలయం 11వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఉప సర్పంచ్ సాయివజ్రం, మాజీ సర్పంచ్ సుందరపు కనకప్పారావు, వీఆర్వోల సంఘ రాష్ట్ర కోశాధికారి బొమిరెడ్డిపల్లి శ్రీనివాసరావు తదితరులు సీతారాములను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

కె.వెంకటాపురంలో పారిశుధ్య చర్యలు

కోటవురట్ల : కె.వెంకటాపురంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. వీధుల్లో పేరుకు పోయిన చెత్తను తొలగింపజేసి, డ్రైనేజీలలో పూడిక తీయించారు. పారిశుధ్య కార్మికులు ఇళ్లల్లోని చెత్తను సేకరించారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకారం అందించాలన్నారు. బహిరంగ ప్రదేశాలను పాడు చేయకుండా ఆరోగ్యకర వాతావరణానికి తోడ్పాటు అందించాలని కోరారు.


వారపు సంత వెలవెల

రాంబిల్లి: మండలంలో మంగళవారం వడగాడ్పులు కొనసాగాయి. రాంబిల్లిలో వారపు సంత వెలవెలబోయింది. వ్యాపారాలు ఆశించినంతగా సాగకపోవడంతో వ్యాపారులు ఉసూరుమన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేడిగాలులు కొనసాగాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గతంలో ఎప్పుడూ జూన్ రెండో వారంలో ఇంతగా వడగాడ్పులు లేవంటూ వృద్ధులు గగ్గోలు పెడుతున్నారు.

నేటి నుంచి విత్తన నమోదు

మునగపాక : మునగపాక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి విత్తన నమోదు కార్యక్రమం జరుగుతుందని మునగపాక వీఏఏ కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌జీఎల్ 2537 రకం 30 కిలోల బస్తాకు రూ.910 అలాగే బీపీటీ 5204 రకం 25 కిలోల బస్తాకు రూ.780 చెల్లించాల్సి ఉందన్నారు. రైతులు విత్తన నమోదుకు వచ్చేటపుడు ఆధార్, వన్ బీ తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కల్యాణి కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సీడీపీవో



తిమ్మరాజుపేటలో అంగన్‌వాడీ కేంద్రం రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీవో ఇందిర

మునగపాక : అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర కోరారు. తిమ్మరాజుపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. పిల్లల హాజరు శాతంతో పాటు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, పిల్లలకు మెరుగైన సేవలందించాలన్నారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలన్నారు. మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

దిగుబడి లేదు.. ధర రాదు!

- కొబ్బరి రైతు దిగాలు
- ఆరేళ్లుగా కొబ్బరి తోటలకు ఫ్లైయాస్ తెగులు
- తగ్గిన దిగుబడులు, ధర లేక నష్టాలు



మండలంలో సాగువుతున్న కొబ్బరి తోటలు



ఎగుమతికి సిద్ధం చేసిన కొబ్బరి



ఎగుమతి అవుతున్న కొబ్బరి బొండాలు

ఎస్.రాయవరం : కొబ్బరి రైతులు వరుస నష్టాల కారణంగా కుదేలు అవుతున్నారు. తెగుళ్ల తీవ్రత తగ్గక పోవడంతో దిగుబడులు పడిపోయి నష్టాలు బాట పట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 6500 ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నట్టు ఉద్యాన వనశాఖ అధికారులు గణాంకాలు చెబుతున్నాయి. ఎస్.రాయవరం, లింగరాజుపాలెం, కొరుప్రోలు, వమ్మవరం, గెడ్డపాలెం ,పెదఉప్పలం, గుడివాడ, గుర్రాజుపేట గ్రామాల్లో కొబ్బరి సాగు ఎక్కువగా చేస్తున్నారు. సుమారు 20 నుంచి 30 ఏళ్ల పెద్ద ఎత్తున సాగు చేస్తున్న కొబ్బరి పంటకు గడిచిన ఆరేళ్లుగా వైట్ ఫ్లెయాస్ తెగులు వదలక పోవడంతో కాపు బాగా తగ్గిపోయి, దిగుబడులు అమాంతంగా పడిపోయాయని చెబుతున్నారు. ఉద్యాన వనశాఖ అధికారుల సహకారంతో వైట్ ఫ్లెయిస్ నివారణకు ఇసోరియా ద్రావణం పిచికారి చేసినప్పటికీ ఫలితం లేదని చెబుతున్నారు. ఇన్ని ఒడుదుడుకులు పక్కన పెట్టి ఉన్న కాస్త దిగుబడులు ఎగుమతులకు సిద్ధం చేస్తుంటే ధర లేక మరింత నష్టం చేకూరుతోందని వాపోతున్నారు.

రైతు పైనే ధర ప్రభావం

ప్రస్తుతం కొబ్బరి ధర కాయకి రూ. 8 నుంచి 10 వరకు మాత్రమే పలుకుతోందని చెబుతున్నారు. అదే రైతు వద్ద అయితే రూ.6 నుంచి 8 రూపాయలు మాత్రమే ఇస్తున్నారంటున్నారు. పి.ధర్మవరం కేంద్రంగా ప్రయివేటు వ్యాపారుల ద్వారా మాత్రమే ఇక్కడ కొబ్బరి, కొబ్బరి బొండాలు ఎగుమతులు చేయాల్సి ఉంది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి కొబ్బరి అధికంగా వస్తుందని, ఆ కారణం చేత పట్టణాల్లో స్థానికంగా వచ్చే ఉత్పత్తులకు రేటు బాగా పడిపోతుందని వ్యాపారులు చెబుతున్నారు. ధర ఉన్నా, లేకున్నా వ్యాపారులు నష్టపోయేది ఏమీ ఉండదు. మార్కెట్‌లో ధర ప్రభావం రైతుపైనే పడుతోంది. ఇలా సాగులో ఉన్న రైతుకు వరస నష్టాలతో కుదేలు అవ్వాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

ఫ్లైయాస్‌తో తోటకు నష్టం



కొబ్బరి తోటకు వైట్ ఫ్లెయాస్ వల్ల చాలా నష్టం వస్తుంది. దిగుబడులు పడిపోవడంతో పాటు తోటలు నాశరకంగా మారుతున్నాయి. వచ్చిన తక్కువ దిగుబడులు కొబ్బరి కాయలకు ధర పలకడం లేదు.

– సమ్మెంగి నాగేశ్వరరావు, కొబ్బరి రైతు, గోకులపాడు

ఎగుమతులు తగ్గాయి



మార్కెట్‌లో ధర లేకున్నా వ్యాపారాలు కొనసాగిస్తున్నాం. వేసవిలో రోజుకు రెండు నుంచి మూడు లారీల కొబ్బరి బొండాలు ఎగుమతులు చేసేవాళ్లం. ఇప్పుడు దిగుబడులు లేక ఒక లారీ కూడా పూర్తి స్థాయిలో పంపలేకపోతున్నారు. అలాగని మార్కెట్ ధర కూడా పలకడం లేదు.

–కర్రి కోటి, వ్యాపారి, ఎస్.రాయవరం

ద్రావణాలు పిచికారీ చేయాలి

వైట్ ఫ్లెయిస్ దోమ అనేది రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి ఉంది. ద్రావణాలు పిచికారి చేయడం వల్ల కొన్ని తోటలకు తగ్గుముఖం పట్టినా, తగ్గిన మరికొంత కాలానికి యథావిధిగా వచ్చేస్తుంది. మరలా ఇసోరియా, వ్యాపనూనె వంటివి రైతులు పిచికారి చేయాల్సిందే. ఆర్‌బీకేల ద్వారా అందుబాటులో ఉంచాం.

–గణేష్, ఇన్‌ఛార్జి ఉద్యాన వనశాఖ అధికారి, ఎస్.రాయవరం

ప్రభుత్వ సంస్కరణలు పాఠ్యాంశాలుగా చేర్చాలి

- ఎమ్మెల్యే బాబూరావు
- విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



బోదిగల్లంలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



సిరసపల్లిలో విద్యార్థులకు విద్యాకానుక అందజేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు

నక్కపల్లి : రాష్ట్రంలో విద్యాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం ఆయన బోదిగల్లం గ్రామంలో నియోజకవర్గ స్థాయి జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన కిట్లు బ్యాగులు, పుస్తకాలు, షూస్, బెల్టు తదితర వస్తువులు అందజేశారు. విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం బడులు తెరిచిన సమయానికి పాఠశాలల్లో వీటిని సిద్ధం చేయడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో కూడా పాఠశాలల్లో ఇటువంటి సదుపాయాలు కల్పించలేదన్నారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకు వచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలను పుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చాలన్నారు. ప్రభుత్వం పడ్డ శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూఎఫ్‌ఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ సర్పంచ్, మున్సీసా, ఎంపీటీసీ గొర్ల గోవిందు, అధికారులు, హెచ్ఎం సత్యనారాయణ, నాయకులు నర్సింహమూర్తి, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : రాష్ట్రంలో విద్యకు పెద్ద పీట వేస్తూ పేద విద్యార్థులకు అండగా నిలిచిన ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని ఎస్.రాయవరం ఎంపీటీసీ బైపా శ్రీనువాసరావు అన్నారు. మండల కేంద్రంలో గల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఆదిమూర్తి పాల్గొన్నారు.

మునగపాక : విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి పేర్కొన్నారు. టి.సిరసపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్‌లను ఆమె విద్యార్థులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, హెచ్ఎం మల్లేశ్వరరావు, పీఎంసీ ఛైర్మన్ వీరలక్ష్మి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పోషకాహారం అందజేయాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కొండలరావు

రాంబిల్లి: మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు అన్నారు. మామిడివాడ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో పరిశీలించారు. పోషకాహార పంపిణీపై ఆరా తీసారు. రికార్డులు పరిశీలించారు. జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీపై ఉపాధ్యాయులతో చర్చించారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ఇతర ప్రభుత్వ భవన నిర్మాణ పనులు, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పలనర్స, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి అన్నారు. టి.సిరసపల్లిలో మంగళవారం ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో అందించిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌లను కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సహకారంతో సిరసపల్లిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు.

విత్తనాల ఎంపికే కీలకం



వరి పంట(ఫైల్) (ఇన్‌సెట్) ఆర్బీకేలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

వ్యవసాయ సాగులో విత్తన ఎంపిక కీలకం. రైతు నకిలీ విత్తనాల బారిన పడి మోసపోరాదు. అందుకే సీఎం జగన్ నేతృత్వంలోని రైతు ప్రభుత్వం నాణ్యమైన విత్తనాలను అందిస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు సరిపడా మేలైన విత్తనాలు ఇప్పటికే ఆర్బీకేలకు చేరాయి. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

- ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న రైతులు
- నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు
- ఆర్బీకేల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు

అనకాపల్లి రూరల్ : వ్యవసాయంలో అత్యంత ప్రధానమైనది విత్తన ఎంపిక. ఈ ప్రక్రియే రైతు దశ, దిశను మార్చుతుంది. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి. విత్తన కొనుగోలు సమయంలో అప్రమత్తంగా లేకపోతే కొందరు వ్యాపారులు నాణ్యత లేని విత్తనాలు అంటగట్టే ప్రమాదం ఉంది. ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి సబ్‌డివిజన్ పరిధిలో దాదాపు 17 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తారు. నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తే పంట ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయాధికారులు, నిపుణులు చెబుతున్నారు.

నాణ్యత గుర్తింపు ఇలా..

విత్తనాలు బ్రీడర్ ఫౌండేషన్ సర్టిఫైడ్ ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో లభిస్తాయి. వీటిని సాగు చేసి మళ్లీ విత్తనాలుగా వినియోగించవచ్చు. దీని వల్ల రైతులకు విత్తన భారం తగ్గుతుంది. బ్రీడర్ విత్తనాన్ని వ్యవసాయ పరిశోధనా స్థానాలు, యూనివర్సిటీలు, విత్తన కంపెనీలు శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. బ్రీడర్‌సీడ్(విత్తనం)కు బంగారం రంగు ట్యాగ్ ఉంటుంది. ఈ విత్తనాల ధర కాస్త ఎక్కువ. దుకాణాల్లో విరివిగా లభ్యం కావు. బ్రీడర్ సీడ్ నుంచి ఫౌండేషన్ సీడ్‌ను ఉత్పత్తి చేస్తారు. వివిధ ఉత్పత్తి సంస్థలు సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో వీటిని పండిస్తారు. ఫౌండేషన్ విత్తనానికి తెలుపు రంగు ట్యాగ్ ఉంటుంది. ఫౌండేషన్ సీడ్ నుంచి వచ్చే విత్తనాన్ని సర్టిఫైడ్ సీడ్‌గా వ్యవహరించి, దీనికి నీలం రంగు ట్యాగ్ వేస్తారు. సర్టిఫైడ్‌సీడ్ నుంచి వచ్చే విత్తనాలను ట్రూత్‌లేబుల్ విత్తనాలుగా వ్యవహరించి వీటికి ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వ్యవసాయశాఖనుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు సమయంలో తీసుకున్న బిల్లులను పంట కాలం పూర్తయ్యేవరకూ జాగ్రత్తగా భద్రపర్చుకోవాలి. బిల్లుపై విక్రయదారుని పేరు, రాష్ట్ర అమ్మకం పన్ను నెంబర్, నికర తూకం, నికర ధర, లాట్ నెంబర్, విత్తన రకం, గడువు తేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ లూజు(విడి) విత్తనాలను కొనుగోలు చేయరాదు. గడువు దాటిన విత్తనాల జోలికి అసలు వెళ్లకూడదు. విక్రయదారులిచ్చే కరపత్రాలు తీసుకుని, వాటిలో పేర్కొన్న అంశాలను పూర్తిగా చదివి అవగాహన చేసుకోవాలి. విత్తనం కొనుగోలు చేసిన వెంటనే వాటిని పరీక్షించి మొలకశాతం పరిశీలించాలి. మొలకెత్తే సమయం, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించాలి.

నకిలీ కట్టడికి ప్రభుత్వం చర్యలు

నకిలీ విత్తనాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసం చేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, కలెక్టర్లు, వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, పోలీస్ అధికారులు విత్తనాలు విక్రయించే దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నాణ్యత లేని, నకిలీ విత్తనాలను అరికట్టే చర్యల్లో భాగంగా ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలను సరఫరా చేస్తోంది. ధర తక్కువని ప్రైవేట్ వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి, మోసపోకుండా రైతుల్లో అవగాహన పెంచుతోంది.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి



బోదిగల్లంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు అన్ని విషయాల్లోను ప్రాధాన్యం ఇస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మంగళవారం ఆయన పెదబో దిగల్లంలో గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఇక్కడ మసీదుకు రోడ్డు, తాగునీరు సదుపాయాలు గతంలోనే కల్పించడం జరిగిందన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పెదదొడ్డిగల్లు, బోదిగల్లం, సీతంపాలెం గ్రామంలో ఇంటింటికి తాగునీరు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించామన్నారు. అభివృద్ధిని చూసి ఓటేయాలని, పనిచేసే ప్రభుత్వానికి నాయకులకే పట్టం కట్టాలని అన్నారు. గ్రామంలో పలువురి విజ్ఞప్తుల మేరకు అర్హత గల వారికి పింఛన్లు, ఇళ్లు నిర్మించుకునేందుకు చర్యలు తీసుకోవాలని వలంటీర్లను, సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. బిల్లు చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, వైస్ ఎంపీపీలు ఈశ్వరరావు, నానాజీ, సర్పంచ్ మున్సీసా, ఎంపీటీసీ గోవిందు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, బీసీ సెల్ నాయకులు నర్సింహమూర్తి తాతబాబు, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ, ఏఈ రాజు పాల్గొన్నారు.

బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలిద్దాం

చైల్డ్ లేబర్ ఆఫీసర్ నరేష్‌కుమార్



బాల కార్మికులకు అవగాహన కల్పిస్తున్న చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంట్, ఐసీడీఎస్ సిబ్బంది

యలమంచిలి : బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యలమంచిలి లేబర్ ఆఫీసర్ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో యలమంచిలి పట్టణంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల కార్మికుల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా యలమంచిలి పట్టణంలో సీడ్స్ ఆర్గనైజేషన్, ఐసీడీఎస్ బృందం ఆధ్వర్యంలో పట్టణంలో పలు దుకాణ సముదాయాల్లో 14 సంవత్సరాలు నిండని బాల కార్మికులను గుర్తించి వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి చట్టాలపై అవగాహన కల్పించారు. దుకాణాల్లో బాల కార్మికులను పనులకు వినియోగించరాదని దుకాణ యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. పిల్లలను పనులకు దూరంగా ఉంచడంతో పాటు విద్య పట్ల ఆసక్తి కలిగించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో యలమంచిలి పట్టణంలో ఐసీడీఎస్ సిబ్బంది సభ్యులు, రంజాన్ బేబి, మహిళా కానిస్టేబుల్ సంతోషి కుమారి, పట్టణ పోలీసులు, చైల్డ్ ఆర్గనైజేషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఏటికొప్పాకలో మొక్కలను నాటుతున్న జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి

యలమంచిలి : పర్యావరణ పరిరక్షణలో భాగంగా యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామంలో బండిమాంబ ఆలయం వద్ద మొక్కలను నాటే కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలని అన్నారు. మొక్కల పెంపకం ద్వారా వాతావరణంలో కాలుష్యాన్ని అరికట్టి ఆక్సిజన్ పెంపొందించేందుకు దోహద పడుతుందన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని, పారిశుధ్యం మరింత మెరుగుపడేలా ఎప్పటికప్పుడు పచ్చదనం పరిశుభ్రతపై ప్రజలకు తెలిసేలా అధికారులు చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సేనాపతి రాము, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరణం రవి, సర్పంచ్ లక్ష్మి, సచివాలయ కన్వీనర్ రమణ బాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిన్నారులకు బంగారు భవితను ఇచ్చేలా..



కోటవురట్లలో జేవీకే కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి

కోటవురట్ల : చిన్నారుల బంగారు భవితకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేసిందని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని, పిల్లలకు చదువుపై ఆసక్తి కలిగేలా అన్ని వసతులు కల్పిస్తున్నారని అన్నారు. ఎంఈవో అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాలను మెరుగుపరిచి నాణ్యమైన విద్య అందేలా చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సూర్యారావు, కో ఆప్షన్ మెంబర్ ఖుదా బాషా, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్ వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నాగులాపల్లిలో సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే రమణమూర్తిరాజును కలిసిన నాగులాపల్లి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

మునగపాక : నాగులాపల్లిలోని సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. నాగులాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు మంగళవారం ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొంతకాలంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, గ్రామంలోని పలు ఆలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముదిరాజ్ కాలనీలో పాఠశాలను తిరిగి అందుబాటులోకి తీసుకురావడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పార్టీ యువజన విభాగం నాయకుడు బొడ్డేడ బుజ్జి తదితరులున్నారు.

8 మందికి కంటి శస్త్రచికిత్సలు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వైద్యురాలు పి.దేవి తెలిపారు. రోటరీ ఫౌండేషన్, వర్తక సంఘం ప్రసూతి ఆస్పత్రి సహకారంతో సోమవారం 24 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా 8 మందిని ఐవోఎల్ ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. వీరిని మూడు రోజులు ఆస్పత్రి పర్యవేక్షణలో ఉంచి, ఉచితంగా మందులు, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ కంటి ఆస్పత్రి ఛైర్మన్ రవిరామ్ జవహర్, వైద్యులు, సభ్యులు పాల్గొన్నారు.

వైఎంవీఏ హాల్లో రక్తదాన శిబిరం నేడు

అనకాపల్లిటౌన్ : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపంలో వైఎంవీఏ హాల్లో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేజనా ఐక్యవేదిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ కోరిబిల్లి పరి తెలిపారు. స్థానిక విజయరెసిడెన్సీ ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రక్తదాన శిబిరం బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రక్తదాన శిబిరం కొనసాగుతుందన్నారు. 18 నుంచి 60 సంవత్సరాలు వయసున్న ఆరోగ్యవంతులైన వ్యక్తులు రక్తదానం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు కాండ్రేగుల చందు, వేగి త్రినాథ్, కృష్ణ, పెంటకోట ప్రసాద్, శ్రీరామ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com